# ఎడారిలో పూలు



## 23

డా॥ ముక్తేవి భారతి

పక్కలో పసిపిల్ల కేర్‌మంది. ఉలిక్కిపడి పక్కకి చూసిన సునంద విస్తుపోయింది. తన కొడుకు పక్కనే నిద్రపోతున్నాడు. ఈ పసిగుడ్డు -సునంద గబుక్కున మంచం దిగింది. అంతలోనే పిల్ల ఏడుపు వినిపించి గదిలోకొచ్చిన జానకమ్మ, పసిగుడ్డుని ఎత్తుకుంది.

'ఏమిటిదంతా' అరిచింది సునంద తల్లివంక చూస్తూ 'ఒళ్ళో వేసుకుని' ఏదో తల్లి అంటుంటే, 'పాలివ్వాలా' - సునంద గొంతు ఇల్లంతా ప్రతిధ్వనించింది! పసిపిల్లని ఎత్తుకుని వంటింటివైపు నడిచి చిన్నగ్లాసులో పాలు చెంచాతో పిల్లకి పట్టింది జానకమ్మ.

కూరలు తీసుకురావటానికెళ్ళిన సత్యం మేష్టారు కూరల సంచితో లోపలికొచ్చారు.

'నాన్నగారూ ఏమిటిది' అంది సునంద.

'అదా, అది అంతే' - 'ఇదిగో, అమ్మ, ఆ పిల్లని నా చేతికిచ్చి, బెండకాయలు లేతవి తెచ్చాను, వంకాయ పెద్దది తెచ్చాను - ఆ కూర, ఆ పచ్చడి గబగబా చేయి" - లోపలికెళ్ళిపోయారు సత్యంగారు.

సునంద చాలా కోపంగా గదిలోకెళ్ళి తలుపేసుకుంది. పిల్లాడు నిద్రపోతున్నాడు - ఈ పసిపిల్ల ఎక్కడనుంచి వచ్చిందో, ఎవరిదీ - అయినా, అమ్మానాన్న ఎందుకిలా చూస్తున్నారూ - సునంద ఫోన్ తీసింది, అమెరికాలో వున్న అన్నయ్యకి తెలుసా ఇది అనే విషయం కనుక్కుందామని... కానీ మళ్ళా మనసు మార్చుకుంది సునంద.

తలుపు తీసి వంటింట్లోకొచ్చింది సునంద. అమ్మ వంట పనిలో వుంది. నాన్న పక్కగదిలో గుడ్డ ఉయ్యాలలో పాపని ఊపుతూ, ఓ చేత్తో కాఫీగ్లాసు పట్టుకున్నారు.

ఇంక సునంద సహనం పూర్తిగా ఆగిపోయింది. ఆవేశం హద్దులు దాటింది. 'నాన్నా, నా దగ్గర ఏమిటీ రహస్యం - దీన్ని ఎక్కడినుంచి తెచ్చారూ - ఎందుకు తెచ్చారో చెప్పండి నాన్నా - నేను మీరు కన్నపిల్లనేగా, నా దగ్గర దాస్తారేమిటీ - సునంద ఆవేశంతో ఊగిపోతుంటే, సత్యం కూతుర్ని దగ్గరికి పిలిచాడు 'ఇటు రా చూడు నిద్రలో ఎలా నవ్వుతోందో' అన్నాడు.

సునంద ఆ గదిలో కుర్చీలో కూలబడి పోయింది. పిల్లలు లేనివాళ్ళు పిల్లల్ని పెంచుకుంటారు, కానీ పిల్లలుండి, వాళ్ళని పెంచి పెద్దవాళ్ళని చేసి, వాళ్ళ పెళ్ళిళ్ళు చేసి, మనుషుల్ని ఎత్తుకున్నాక, ఇప్పుడీ పసిగుడ్డుని పెంచటమా?! - ఎందుకీ బాధ్యత ఎందుకీ బరువూ - సునందకి ఒక్కసారి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఎందుకని దాస్తోంది తన దగ్గర తల్లి అనే బాధ, ఒక విధంగా కోపం కట్టలు తెంచుకున్నాయి సునందకి. ఎప్పుడో, పేపరు చదువుతూ, 'ఇటు చూడు, ఈ సంఘంలో మనుషులే కరువైపోతున్నారేమిటో - పనిపిల్లని కొడితే, ఆ పిల్లకాలు విరిగిందిట - ఛీ, ఎంత రాక్షసత్వం అంటూ పేపరు చదివి విషయమంతా కూతురికి చెప్పింది జానకమ్మ. 'చాల్లే - ఆ పనిపిల్ల ఎంత ఏడ్చిందో, ఏమేమి ఎత్తుకు పోయిందో, ఆ ఇల్లాలు మాత్రం ఊరికే కొడుతుందా, ఈ వంకతో ఆ పనిపిల్ల అమ్మా, అయ్యా ఎంత డబ్బు గుంజుతున్నారో పాపం' అంది సునంద. జానకమ్మకి ఒళ్ళు మండిపోయింది. పనిపిల్లపై జాలి చూపించ కుండా, ఆ డబ్బున్న ఇల్లాలి తరపున మాట్లాడుతావా - ఎవర్నయినా, అందులోనూ పనిపిల్ల, చిన్నది అలాటి వాళ్ళని ఇలా బాధిస్తే, చూస్తూ ఊరుకోదులే' అంది జానకమ్మ పేపరు మడిచి దాస్తూ.

సునంద ఫక్కున నవ్వి "ఎవరూడుకోదూ" అంది. 'అన్నీ కనిపెట్టేవాడొకడున్నాడులే - ఇవాళం తెలుస్తుందీ - అయినా సునందా, నాకు చాలా ఆశ్చర్యంగా వుంది నువ్వు అంత నిర్దాక్షిణ్యంగా మాట్లాడటం - ఆ పిల్ల ఎవరో కనుక్కుని, దానికి నాకు చేతనైన సాయంచేసి, ఆ ఇల్లాలికి బుద్ధిచెప్పి వస్తా' అంది ఆవేశంగా జానకమ్మ.



'అమ్మా నీకెందుకీ గోల, పేపర్లో ఎన్నో ఇలాటివి - మనకెందుకూ - మొన్నకూడా, ఎక్కడో 'చెత్తబుట్టలో పసికందు' అనే వార్త విని మహా దుఃఖ పడిపోయావు. లోకాన్ని ఉద్ధరించే వాళ్ళు చాలామంది వున్నారులే - నాన్నా, నువ్వు హాయిగా సింగపూరో, లేకపోతే అన్నయ్య దగ్గరకెళ్ళి అమెరికా చూసి రండి - అంతేగాని, వీటన్నిటికీ నీరులా కరిగిపోటం మొదలెడితే ఇక అయినట్టే' అంది సునంద చిరాగ్గా.

'ఒక మంచిపని చేస్తే దేవుడు దయ దలుస్తాడు. పుణ్యం అదీ' అంది తల్లి. సునంద ఈమాటు మరీ గొల్లున నవ్వి, 'పుణ్యం, పాపం - వాట్ నాన్సెన్స్, ఎక్కడున్నాయి - రంగు, రూపు ఏమన్నా వుందా - అంటూ ఎంతోసేపు వాదించింది. తల్లికి బాధనిపించింది సునంద ధోరణి.

ఐదు గంటలయేసరికి పిల్లకి ముఖం నీళ్ళతో తుడిచి, పౌడరు రాసింది జానకమ్మ. పక్కనే కూచున్న భర్తతో, 'దీనికి పేరు నిర్ణయించా' అంది. అలా అంటూనే 'అమూల్య' అంది. ఆ పసిది బోసినవ్వు నవ్వింది. 'ఎప్పటి ఋణానుబంధమో' అనుకుంటూ గుండెలకి హత్తుకుంది పిల్లని జానకమ్మ.

'దానికి చెప్పచ్చుగా - అది మనసులో బాధపడితే బాగుంటుందా - అయినా, ఇంకోవారం రోజుల్లో అది దానింటికి వెళ్ళిపోతుంది - నీ పద్ధతి నాకు బాగాలేదు జానీ - నన్ను నోరెత్తనీయవు - నిజమే, అది మనం కన్నపిల్లేనా - అసలు దాంతో కూడా సంప్రదించే ఈ పని చేస్తే బాగుండేది' అన్నాడు రామారావు, జానకి భర్త. జానకి చిన్నగా నవ్వి, ఏదో రహస్యం చెప్తున్నట్టు గొంతు తగ్గించి, 'ఎందుకు చెప్పనండీ, సునంద మన బంగారుతల్లి కాదూ - ఇప్పుడే విషయం తెలిసిపోతే, అది మహాకాళి అవతారం ఎత్తుతుంది. ఈ పసిగుడ్డును వెంటనే వదిలేసి రమ్మని చాలా గోల చేస్తోంది. చెప్తా... చెప్తా... సమయం చూసి చెప్తా - మీరేమీ బెంగపడకండి' అంది అనునయిస్తూ జానకి. 'ఒకరికిచ్చిన మాట తప్పే మనిషిని కాను నేను' అంది గట్టిగా.

నిజానికి కూతురికి చెప్పకుండా పసిపిల్లని తేవటమే ఇష్టం లేదు రామారావుకి. కానీ, జానకి మాటకి ఎదురుచెప్పటం తెలియని రామారావు 'సరే, చెప్దాంలే' అని సద్దుకున్నాడు.

తెల్లారగానే సునంద తల్లితో అంది. 'మమ్మీ, సాయంత్రం ఫ్లైట్‌లో వెళ్ళిపోతున్నా... మీ అల్లుడొచ్చేశారు బెంగుళూరు' అంది సీరియస్‌గా.

జానకి నవ్వి, "లేడికి లేచిందే పరుగు' అంటే ఇదే... మంచిరోజు చూసి, చీర, పసుపుకుంకుమ పెట్టి, చలివిడి చేసి పెట్టి పంపుతాను. సాయంత్రం వెళ్ళిపోతానంటావేమిటీ' అంది పూలమాల తన సిగలో తురుముకుని, కూతురికి కూడా ఇచ్చింది. "ఐహేట్- ఇలా తల్లో పూలు పెట్టుకోటం నాకిష్టం లేదు" అంటూ బల్లమీద ఆ పూలమాల పడేసింది సునంద.


'మంచిరోజు చూసి నాన్నగారొచ్చి దింపుతారు నిన్ను' అంది సిగలో పిన్నులు సరిచేసు కుంటూ జానకి. నాకు ఈ పిచ్చి ఛాదస్తాలు లేవు - "ఐడోంట్ బిలీవ్ ఆల్ దిస్ అన్నీ మంచిరోజులే" అంది మొండిగా సునంద.

'అంతకోపమయితే ఎలాగ తల్లీ - రెండు రోజులు ఆగు. అన్నీ అమ్మ చెప్తుంది' అన్నాడు తండ్రి బతిమాలుతూ. "అక్కర్లేదు డాడీ - నేను ఆడపిల్లని - ఒకసారి పెళ్ళయి వెళ్ళిపోయాక నేను కన్న తల్లిదండ్రులకి కూడా బయటదాన్నే' అంది సునంద.

'సరేలే - దీన్నెత్తుకో' అంటూ ఉయ్యాల్లో వున్న పిల్లని తీసి సునంద ఒళ్ళో పెట్టింది జానకమ్మ. అప్రయత్నంగా గుండెలకి హత్తుకుంది సునంద. 'అమ్మమీద కోపం కానీ, పసిపిల్ల మీద నాకేల కోపం' అంది తల్లివంక చూసి.

'నే చెప్తున్నదీ అదే' అంటూ కేలండర్ చూస్తూ 'దశమి బుధవారం బావుంది - వెదుదువు గానీ, అతను వచ్చాక, ఇంట్లో నీవు లేకపోతే ఇబ్బంది పడతాడు' అంది.

భర్తకి ఎలా చెప్పాలో ఈ విషయం అని సతమతమవుతూ 'అమ్మకి ఈ ఆలోచన ఎందుకొచ్చిందీ! ఈ పిల్లని ఎక్కడ నుంచి తెచ్చిందీ, అన్నయ్యకి తెలిస్తే బాధపడదూ -ఏమిటో, సునందకి మళ్ళా తల్లిమీద పీకలదాకా కోపమొచ్చింది. తన దగ్గర అంత రహస్యంగా దాస్తుంటే, నాన్నయినా నోరువిప్పి చెప్పకపోతే, తనకేలపట్టిందీ! ఏమన్నా చేసుకోనీ!!




సునంద క్షణాల్లో బయటకు నడిచింది బాగ్ భుజాన వేసుకుని. బయలుదేరేముందు బెంగుళూరులో భర్తతో మాట్లాడింది.

+ + +

జానకమ్మ, భర్త ఏదో మాట్లాడుకుంటున్నారు రహస్యంగా... "చెప్పరాదుటే' బతిమలాడాడు రామారావు. మీకు తెలియదు ఊరుకోండి - చెప్పేస్తే దీన్ని రోడ్డుమీద విసిరేస్తుంది... అది మన పిల్లే అయినా, దానికి ఇలాటివి నచ్చవు - దాని ఆలోచనలన్నీ అది, భర్త, పిల్లాడు- అంతే!! - నన్ను విసిగించకండీ, నేను చేస్తోన్న పని గొప్పదే!! సునందకి చెప్తా... ఎందుకు చెప్పనూ' అంది జానకమ్మ కాఫీ తాగుతూ.

సునంద చాలా ఉత్సాహంగా వచ్చింది



లోపలికి... "సాయంత్రం వెళ్లిపోతున్నా... శివ ఎయిర్‌పోర్ట్‌కి వస్తాడు' అంటూ లోపలికెళ్ళి బ్యాగ్ సర్దుకుంటుంటే, తండ్రికి కూతురి పద్ధతి నచ్చలేదు. తల్లికీ కోపమొచ్చింది కానీ, దాని భర్త దగ్గరికి అది వెడుతుంటే మనకీ మంచిదేలే' అనుకుంది తల్లి మనసులో.

+ + +

డైనింగ్‌టేబుల్ దగ్గర కూచుని కబుర్లు చెప్పుకుంటూ కాఫీ తాగుతున్నారు సునంద, శివ.

'నేనో విషయంచెప్తా, మీరు ఆశ్చర్యపోతారు - అంతేకాదు, నాకొచ్చినట్టే మీకూ కోపం పీకలదాకా వస్తుంది' అందిసునంద కాఫీకప్పు బల్లమీద పెట్టి 'ఏమిటీ, తొందరగా చెప్పు' అన్నాడు శివకళ్ళజోడు సరిచేసుకుంటూ.

'ఓ పసిగుడ్డుని తెచ్చారు....'

"ఎవరూ" అన్నాడు శివ.

'ఎవరో అయితే మనకేం - అమ్మా, నాన్నా'

'ఏమిటీ - పసిపిల్లని ఈ వయసులో పెంచుతారా'

'అదేకదండీ నేను మొత్తుకునేది - మా అమ్మ అదేదో గొప్ప సంఘసేవ చేశాననుకోడం, మా నాన్న, ఆవిడ మాటకి ఎదురుచెప్పకుండా చేతులు కట్టుకు నించోటమూనూ'.

'ఏమిటిదంతా, నేను మాట్లాడతానుండు, ఆ పిల్లని వెంటనే అనాథశరణాలయాలలో దింపి రమ్మంటా'

'ఆ - నా మాట వినంది, మీ మాట వింటారా... అంతే, వాళ్ళ కర్మ - అనుభవించ నీయండి' అంటూ ఫోను మోగుతుంటే తియ్యడాని కెళ్ళింది.

శివ మనసులో చాలా సంతోషముంది ఆ క్షణం.... ఎలాగైనా సునందని ఒప్పించి ఆ పసిపిల్లని ఇక్కడికి తెచ్చేయాలి... శివకళ్ళలో నీళ్ళు తిరిగాయి... స్నేహితుడి కులాంతర వివాహానికి తనే పెద్దరికం వహించటం, ఆ తర్వాత వాళ్ళచేత కాపురం పెట్టించటం, రాణి కూతుర్ని కనడం - శివ అప్రయత్నంగా నిట్టూర్చాడు... ఆతర్వాత, తర్వాత - అంతా శూన్యం. రాణి మరణం, పసిపిల్లతో స్నేహితుని ఒంటరితనం 'దీన్ని అనాథాశ్రయంలో వదిలేస్తానురా... నేను అమెరికా వెళ్ళిపోతున్నా' అన్నపుడు స్నేహితుడి కళ్ళనుండి జారిన కన్నీళ్ళు తుడిచాడు శివ... ఆ పిల్లని నేను పెంచితే - ఇద్దర్ని పెంచలేదా - ఆ ఆలోచన రాగానే, ఇలాటివి ఏవో మనసుని కదిలించవు సునందకు, పైగా సునందే బాబుతో సతమతమవుతోందని తెలిసిన శివ, ఆ బాధ్యత కొన్ని రోజులు ఎవరికైనా అప్పగించాలని, సునంద మనసు మారితే తనే ఆ పిల్లని పెంచవచ్చని అనుకున్నాడు - గొప్పమనిషి అత్తగారు కళ్ళముందు నిల్చింది. ఒక్క ఏడాది చూడు... నేను నాతో నా పిల్లని తీసికెళ్ళిపోతా అని బతిమాలిన స్నేహితుని గొంతు శివ మనసులో ఇంకా మారుమోగుతూనే వుంది. ఒకవైపు స్నేహధర్మం, మరోవైపు మానవత్వం శివను ఉక్కిరిబిక్కిరి చేశాయి... అయినా, ఎడారిలో పూలు పూయవా... పూస్తాయి!! ఇలా అనుకుంటుంటే సునంద వచ్చి బల్లముందు కోపంగా కూచుని, "నాన్నకి జ్వరంగా వుందిట'.

"అయ్యో పాపం... ఆ పిల్లతో"

"ఆ పిల్ల గురించి మాట్లాడకండి' అరిచింది సునంద.

'నేనొక విషయం చెప్తా – ఆ పిల్లని....'

'మనం తెచ్చుకుందామంటారా... ఛీ, మనకేం కర్మ – మన బుజ్జిగాడున్నాడు కావాలంటే...' అంది.

శివ పకపకా నవ్వాడు... అంతనవ్వెందుకొస్తోందో అర్థం కాలేదు సునందకి

'సునందా – కొంచెం, ఒక్క క్షణం మనిషిలా ఆలోచించు... వృద్ధులయిన మీ అమ్మానాన్నా ఆ పిల్లని పెంచటం ధర్మమా, మనం పెంచటం ధర్మమా... ఒక దిక్కులేని పిల్లకి ఓ ఏడాదిపాటు ఆశ్రయమిస్తే...'

"మళ్ళీ చెప్పండి – ఏడాదిపాటా.... ఆ తర్వాత'

శివ నోటిమీద చేయి వేసుకున్నాడు. 'అంటే ఏడాది పెంచితే వదలటం సాధ్యం కాదుగా... ఆఖరికి కుక్కపిల్లని పెంచినా...'

'సునంద నవ్వి' పేపర్లో చదివా. కుక్కని ఎన్నో ఏళ్ళు ప్రేమగా పెంచారుట. ఆ కుక్క చచ్చిపోతే, ఆ యజమాని కుక్క బెంగతో మంచమెక్కాడుట' అని, 'అయినా ఏమిటా పిచ్చిప్రేమలూ' అంది.

శివ లేచి వీధివైపు చూస్తూ నిలబడ్డాడు... రహస్యమెందుకూ, చెప్పేస్తా – ఒక్క ఏడాది మాత్రమేనని – సునంద మనసు మారకపోతే, నేనే అక్కడకెళ్ళి పిల్లను పెంచుతా – అంతేకానీ, పసిపిల్లని, వృద్ధుల్ని బాధిస్తే మహాపాపం!! నా మనసే నన్ను క్షమించదు.

\+ + +

శివ మనసు నిశ్చయమైపోయింది.

'సునందా – మీ అమ్మ పెంచుతున్న పిల్ల....' మాట ఆగింది.

'అనాథాశ్రమంలో దింపేయమని చెప్తారా – అదే కరక్టు'

'కాదు – మనం తెచ్చి పెంచుదాం ఒక ఏడాది....'

సునందకి ఒక ఏడాది ఏమిటో అర్థం కావటం లేదు!!

శివ విషయం చెప్పేశాడు. రహస్యం గుండెని కోసేస్తోంది. తన మాట మీదే ఆ పెద్దవాళ్ళు గౌరవముంచారు... తనే ఈ విషయం సునందకి చెప్పద్దన్నాడు!! కానీ, శివ ఆవేశం కట్టలు తెంచుకుంది.

'సునందా...' పెద్దకేక పెట్టాడు శివ.

ఆవేశంతో, గొంతు గద్గదికమవుతుంటే చెప్పేసాడు.

'నీ మనసు మారుతుందనుకుంటున్నా... మనిషై పుట్టాక మానవత్వముండాలి. అయినా, నిన్ను



ఒప్పించను – నీకిష్టమైతేనే ఏడాది దాటాకా నా స్నేహితుడికి పిల్లని అప్పగిస్తానని మాట ఇచ్చాను. సునందా ఓ విషయం నాకు తేల్చిచెప్పు – నిన్ను బలవంతం చేయను. ఆడవాళ్ళకి మాతృత్వం గొప్పవరం అని, అమ్మతనం గొప్పదని చెప్పేమాటలు నీ విషయంలో నేతిబీరకాయలో నేయిలాటిదే అని అర్థం చేసుకుంటా.. శివ మరో మాట మాట్లాడకుండా ఆఫీసుకెళ్ళిపోయాడు.

సునంద వాలుకుర్చీలో అలాగే కూచుంది. రకరకాల ఆలోచనలతో మనసు ముక్కలవుతోంది. ఆ రోజు తను ఎంతో అసహ్యించుకుని, పిల్ల ముఖం కేసి కూడా చూడని తన ప్రవర్తన, తన అహం కళ్ళముందు కదులుతుంటే సునంద కళ్ళలో నీళ్ళు తిరిగాయి.... తన తల్లితండ్రి ఎంత మహోన్నతులో, వారి కడుపున పుట్టిన తను ఇంత సంకుచితంగా వుండటమా. 'తన భర్త స్నేహితునికిచ్చిన వాగ్దానం తనకేమీ సంబంధం లేదా!! ఇదా దాంపత్యం!! అమ్మానాన్నల మనసు, తన భర్త మనసూ బాధపెట్టాను. పాపం పుణ్యం తెలియని ఆ పసిబిడ్డ – సునంద మనసునిండా ఆవేదన. తన అమానుషత్వం తనని వెక్కిరిస్తోందన్న భావం నిలువునా కుదిపేసింది ఆ క్షణం. పమిటతో కన్నీళ్ళు తుడుచుకుంది.

ఎదురుగా బొమ్మలతో ఆడుకుంటున్నాడు బుజ్జిగాడు. 'వీడికో చెల్లెలు' – సునంద మనసు ఆనందంతో పొంగిపొర్లింది. ప్రక్షాళనమంటే ఇదేనేమో. సునంద ఎదురుగా గోడకున్న కృష్ణుని పటానికి నమస్కరించింది. ఫోన్ దగ్గరికి నడిచింది.

"హలో.. నేను – ఫ్లైట్ టిక్కెట్టు బుక్ చేయండి. పాపని తెచ్చుకుందాం" "ఎడారిలో పూలు పూస్తాయని నాకు నమ్మకముంది సునందా" శివ గొంతులో ఆనందపు విరిజల్లు. శివమాటలు అర్థమయ్యాయి సునందకి. పెదాలపై చిరునవ్వు వెన్నెల విరిసింది.

# వెన్నెలై వ్యాపించి

ఆదూరి వెంకట సీతారామమూర్తి

ఆమె చూపంతా నా వంకే
రోజంతా రెప్పవేయక అట్లాగే చూస్తుంది
నా ప్రతి కదలికనూ పరికిస్తున్నట్టూ
నా జీవన మార్గాన్ని పరీక్షిస్తున్నట్టూ
నిరంతరం నా వంకే
అదే చూపు.
జ్ఞాపకాల కదలికలు
ఎదలో ఎగసిపడే అలలై
నేనామె కన్నుల వంక చూసినపుడల్లా
రెప్పల మాటున
దుఃఖపు జలపాతాలై నిలుస్తాయి
ఆ పూలమాల వెనుక
శాంతిగా కాంతిగా మెరిసే
ఆ కనుదోయిలో
నాపట్ల ఒకింత జాలి..
అంతకుమించిన ప్రేమ
వెన్నెలై విరబూస్తాయి
ఆ నగుమోము
నాకొక కర్మసిద్ధాంతాన్ని ప్రబోధిస్తుంది.